మా ఊర్లో శివునిగుడి లేదు. మా ఊర్లోనే కాదు, మాకు చుట్టుపక్కలా పది పన్నెండుమైళ్ల దూరంలో ఏ ఊర్లోనూ శివుని గుడి లేదు. కానీ శివరాత్రి వస్తోందంటే చాలు, మాకు చాలా సరదా! బడికి సెలవంటే ఏ పిల్లాడికైనా పండగే కదా! అందునా శివరాత్రి పండగకు ప్రభుత్వం ఒకరోజు సెలవు యిస్తే, మరుసటి రోజు లోకల్ హాలిడే ఉండేది. మిగిలిన అన్ని పండగలకూ పిల్లలకు కూడా ఏవో కొన్ని పనులు తప్పకుండా వుంటాయి. దానికి తోడు ఉపవాసం ఉండాల. వంటలన్నీ చేసి, ఏ మధ్యాహ్నానికో పూజ అయ్యాక తిండి. అంతవరకూ ఆకలికి తట్టుకోలేక ఒక్కోసారి ఏడుపొచ్చేది. పిల్లలను అర్థం చేసుకునే పెద్దలుంటే పరవాలేదు, వాళ్లు ముందుగా తిండిపెట్టేస్తారు. అయితే చాలామంది దేవునికి నైవేద్యం పెట్టిగాని పిల్లలకు పెట్టరు. అందుకని పండగలంటే పిల్లలకు ఎంత సరదానో అంత బాధకూడా. కానీ శివరాత్రి పండగకు ఉపవాసం ఉండాల్సిన అవసరం లేదు. శివాలయమే లేదంటే, ఇక మా ప్రాంతంలో శివరాత్రి పండగను జరుపుకునేది కూడా వుండదు కదా.

# గుగ్గిళ్ళ పండగ

## సుంకోజి దేవేంద్రాచారి

అయితే, ఈ పండగకు తిండి మాత్రం ఫుల్!

శివరాత్రి అంటే మా వైపు 'గుగ్గిళ్ళ పండగ'. మామూలుగా శివరాత్రి ఫిబ్రవరి, మార్చి నెలల్లో వస్తా ఉంటుంది. అప్పటికి ధాన్యం అంతా ఇంటికి చేరి ఉంటుంది. దాదాపుగా పొలం పనులు ఏమీ ఉండవు. ధాన్యం యింట్లో వుంటుంది. చెరకు గానుగ ఆడేసింటారు. బెల్లం కూడా ఇళ్ళలో ఉంటుంది. శివరాత్రి రోజు వాళ్ళ వాళ్ళ శక్తికొద్దీ ఇంట్లో ఉలవలు, అల్సందలు, అనుములు, పెసలు, కందులు ఉడకబెడతారు. పెసలు ఉడకబెట్టేవాళ్ళు కాస్త ఉండేవాళ్ల కింద లెక్క... అందరి ఇళ్ళలో కనీసం రెండు రకాల గింజలయినా ఉడకబెడతారు. పావునుంచి రెండు మూడు శేర్లు ఉడకబెట్టేవాళ్లు కూడా ఉండారు.

శివరాత్రి రోజు పొద్దున్నే లేచి, స్నానాలు అయ్యాక ఉతికిన బట్టలు (కొత్త బట్టలు కుట్టించుకునే వారు దాదాపుగా ఉండరు) వేసుకుంటాం. ఇక బెల్లం కలుపుకుని గుగ్గిళ్ళు తినడం మొదలు బెడతాం. కొందరు అల్సందలతో సుగుంటలు చేస్తారు. ఆ రోజంతా పిల్లలనుంచి పెద్దలవరకూ గుగ్గిళ్ళు తినడమే పని. ఎవరింటికి పోయినా ఇవే ఉంటాయి.


గోలీలు, నక్కాముట్టి, పొట్టాట, ఇస్పేటాకులు... ఇలా అన్ని రకాల ఆటలు ఆ రోజు ఆడతాం. అన్నీ కూడా డబ్బు పెట్టే! ఆ రోజు ఇంట్లో పెద్దోళ్లను పీడించి డబ్బు తీసుకుంటాం. సాధారణంగా పిల్లలు అడగక ముందే పెద్దలు డబ్బు ఇస్తారు. చొక్కాయి జేబులో రూపాయి బిళ్ళలు, నిక్కరు జేబులో గుగ్గిళ్ళు వేసుకుని ఆడుకునేదానికి పోయేవాళ్ళం. మా వూరికి ఆనుకుని యిప్పలగుంట చెరువుంది. చెరువు కట్టకు ఇటుపక్క పెద్దగుండు వుంది. ఆ గుండుపైకి చేరేవాళ్లం. అక్కడ కూర్చుని పూతాబొమ్మా ఆడేవాళ్లం. టైమ్ తెలిసేదే కాదు. మధ్యాహ్నం దాకా ఇదే పని. కొందరు పక్కనే ఉండే చింతచెట్టుకింద చేరి గోలీలు ఆడేవాళ్ళు. మధ్యాహ్నం ఇంటికొచ్చి మళ్ళా గుగ్గిళ్ళు చానా, అన్నం కొంచెం తినేవాళ్ళం. అక్కడి నుంచి చాన్‌బాషా వాళ్లింటికి పోయేవాళ్లం. వాళ్లింట్లో కూర్చుని నక్కాముట్టి ఆడేవాళ్లం. నక్కాముట్టి ఆట నలుగురు ఆడచ్చు. అయితే ఆ నలుగురితో పాటు పందెం కాసేవాళ్లు ఎంత మందైనా వుండచ్చు. దాదాపు ఎగవీధి పిల్లలమంతా వాళ్లింట్లోనే వుండేవాళ్లం. ఒక్కో ఆట ఆడిందానికి చాన్‌బాషా వాళ్ళకు ఐదు పైసలు యిచ్చేయాల.

పొద్దుట్నించీ తినిండే గుగ్గిళ్ళు పని చేయడం మొదలు పెడతాయి. ఒక్కొకరు 'పుర్.. పుర్' మంటా బాంబులేయడం మొదలుపెట్టేవాళ్లు. డబ్బు పోగొట్టుకున్నోళ్లం కూడా అక్కడే వుండేవాళ్లం. చుట్టూ ఆడతా ఉండేవాళ్లను చూస్తా, వాళ్లకు సలహాలు ఇస్తా, వాళ్ల చేత తిట్లు తింటా.. తిట్లను పట్టించుకోకుండా మళ్ళా సలహాలు ఇస్తా ఎంజాయ్ చేసేవాళ్లం. అక్కడ ఉండంగానే ఎవరో వచ్చి చెప్పేవాళ్లు, చాకలోళ్ళ క్రిష్ణ యింట్లో ఇస్పేటాకులు ఆడతాండారని. అంతే, ఇక్కడ డబ్బు పోగొట్టుకుంటా ఉండేవాళ్లలో ఒక్కొక్కరమే అక్కడకు చేరుకునే వాళ్లం. అక్కడ సెట్లాట ఆడేవాళ్లం. ఇస్పేటాకులు పట్టుకునేదానికి కూడా సరిగ్గా వచ్చేది కాదు. అయినా సరే పెద్ద పోటుగాళ్ల మాదిరిగా పేకాట ఆడేవాళ్లం. అక్కడే మొబ్బయిపోయేది. దీపాలు వెలిగించేవాళ్ళు. అప్పటికి ఆకలయ్యేది. అందరం యిళ్ళకు పోయేవాళ్లం. యింట్లో ఉలవచారేసుకుని అన్నం తినే వాళ్లం. తినడం అయిపోతానే మళ్ళా కల్లూరోళ్ళ ఇంటికి గాని, శెట్టిగారింటికి గాని పోయేవాళ్లం. అక్కడ కాసేపు పొట్టాట ఆడేవాళ్లం. ఇద్దరిద్దరు కలిసి ఈ ఆట ఆడచ్చు. చెరు ఐదు పైసలు పొట్టులో వేసి, పొట్టును బాగా కలబెట్టేసి దానిని రెండు భాగాలు చేయాల. ఆ భాగాలు ఒక్కొటి ఒక్కోరికి. ఎవరి పొట్టులో వచ్చిన డబ్బు వాళ్లకే! కాసేపటికి ఆ ఆటకూడా విసుగనిపించేది. పొలోమంటా అందరం కొల్లోల్ల యింటికి పోయేటోళ్ళం. అక్కడ ఇస్పేటాకులు ఆడతాంటారు. పెద్దవాళ్ళు ఒక రూములో ఆడతాంటే, ఇంకో రూములో పిల్లోళ్ళు కూడా ఆడతాంటారు. ఆ రోజు మా వూర్లో ఎవురిపైనా ఆంక్షలుండవు. పెద్దోళ్లు కూడా ఆ రోజు ఆడోళ్లకు భయపడకుండా పేకాట ఆడతారు. పోలీసులు కూడా ఆ రోజు వూర్లోకి వచ్చేవాళ్ళు కాదు.

శివరాత్రి రోజు రాత్రంతా మేలుకుంటే మంచిదని అందరూ చెప్తారు. అందుకని మేము రాత్రంతా మేలుకుని ఉండాలనుకుని ఇట్లా ఆటలు ఆడేవాళ్లం. అయితే రాత్రి తొమ్మిది గంటలకంతా నిద్ర వచ్చేసేది. పెద్దోళ్లు మాత్రం రాత్రంతా దీపాలు పెట్టుకుని పేకాట ఆడతానే ఉండేవాళ్లు.

తొమ్మిది గంటలు దాటిదంటే పిల్లోళ్లు ఒగరొగరే ఎవరింటికి వాళ్ళు పోయేవాళ్ళు.

మరుసటి రోజు మా నాయన నన్నూ, మా అక్కనూ పొద్దున్నే తన వెంట కొల్లోల్ల బాయి దగ్గరకు



తీసుకుని పోయేవాడు. పొద్దు పుట్టకముందే మమ్మల్ని నీటిలో మూడుసార్లు ముంచి లేపేవాడు. మమ్మల్ని 'శివ శివా' అనమనేవాడు. తను కూడా మాతో పాటు 'శివ శివా' అంటా నీళ్ళలో మునిగి లేచేవాడు.

అక్కడినుంచి ఇంటికొచ్చాక, ఇంట్లో దేవుని పటాల దగ్గర కడ్డీలు వెలిగించి, టెంకాయ కొట్టి, శివునికి దండం పెట్టుకునే వాళ్లం. అంతటితో శివరాత్రి పండగ అయిపోయినట్టే. అయితే అంతకు ముందు రోజంతా జాగారం (రాత్రంతా మేలుకోవడం) ఉండటం వలన ఆ రోజు కూడా మాకు సెలవన్న మాట.

మాకు పది పది మైళ్ల దూరంలో 'ఝరి' ఉంది. అక్కడ శివుడు ఉండాడు. శివరాత్రి తర్వాతి రోజు చాలామంది అక్కడకు వెళ్లి, ఏటిలో మునిగి శివుని దర్శించుకుని వచ్చేవాళ్ళు. మేమూ ఒకసారి అలా పోయొచ్చాం.

అప్పుడు నాకు తొమ్మిదేళ్లు. నేను నాలుగో తరగతి చదువుతున్నాను.

మా వూరినుంచి కమ్మారపల్లెకు కిలోమీటరు దూరం. అక్కడ బస్సెక్కి పొంతలచెరువు క్రాస్ కాడ దిగి, అక్కడ బస్సెక్కి మహల్ క్రాస్ కాడ దిగి, అక్కడ బస్సెక్కి ఝరి దగ్గర దిగాల. ఇదంతా చుట్టుదారి. లేదంటే, కమ్మారపల్లెలో కలకడ బస్సెక్కితే నేరుగా ఝరి దగ్గరే దిగచ్చు. అయితే ఈ బస్సు రోజుకు మూడు పూటలు మాత్రమే ఉండేది. అందువలన ఆ బస్సు కిటకిటలాడేది. దాంట్లో ఇరుక్కుని, వూపిరాడక తనకలాడతా పోయేదెందుకని చాలామంది నడుచుకునే పోతారు. మేం కూడా నడుచుకునే పోయినాం. నేనూ, మా అక్కా, అమ్మా, నాన్నా, మాతో పాటు మా వూర్లో వాళ్లు ఇంకా ఐదారుమంది ఉండారు. అందరం సద్దన్నం కట్టుకున్నేం. దోవ పొడుగుకు మాటలు. మాకయితే ఎంత కుశాలగా ఉండాదో.

ఝరి ఇంకో అరగంటలో వస్తాదనంగా అందరం ఒకచోట బాయిదగ్గర కూర్చుని మేం తెచ్చుకోనుండే సద్ది మూటలు ఇప్పి తిన్నేం. ఝరి దగ్గరకు పోయాలకు పొద్దు నడినెత్తికి వచ్చింది. అక్కడ జనం తిరణాలలో మాదరిగా ఉండారు. అంతమంది జనాన్ని నేనెప్పుడూ చూడలా.

ఆ పక్కా, ఈ పక్కా పెద్ద పెద్ద బండలు కొండల మాదిరి వుండాయి. వాటి మధ్యలో ఏరు. ఏట్లో నీళ్లు పారతాండాయి. ఏట్లో నీళ్లు నాకు మోకాళ్ల దాకా వస్తాండాయి. నా వయసు పిల్లోళ్లు చానామంది నీళ్ళల్లో ఆడుకుంటా వుండారు. ఏటి నీళ్ళకు ఆ పక్కా ఈ పక్కా చానా అంగళ్లు ఉండాయి. వాటిల్లో అమ్మతా ఉండేవాటిల్లో 'దవనం' వాసన ఎంత బాగుంటాదో! తల్చుకుంటే యిప్పుడు కూడా నా ముక్కులకు ఆ వాసన సోకతా వుండాది. నేను తొలీగా దవనం వాసన చూసింది ఆరోజే! పిల్లోల్లు ఎగిరి, పెద్దోళ్ళు ఆట్లా యిట్లా తిరుగులాడి ఏట్లో నీళ్ళన్నీ మురికిగా వుండాయి.

ఆ నీళ్ళు దుంకేతావన శివుడిగుడి వుండాదంట. దేవుడికి టెంకాయ కొట్టుకోని రావాలని ఆడికి పోయినాం. అక్కడికి జనం చానా ఎక్కువగా ఉండారు. లోపలికి పోయేదానికి కుదర్లా. పక్కనే దెయ్యాలగుండం ఉండాది. దాంట్లో నీళ్ళు నడుమల్లోతు ఉంటాయి. అక్కడ దెయ్యాలు పట్టినోళ్ళు ఊగతా, అరస్తా ఉండారు. వాళ్లను మూడుసార్లు ఆ నీళ్ళలో ముంచిలేపతా వుండారు. అట్ల మూడుసార్లు మునిగి లేసినారంటే, వాళ్ళను పట్టిన దెయ్యం పోతాదంట. అదంతా శివుని మహత్యం అని మా అమ్మ చెప్పింది.

మా వూరికి ఝరి పడమర దిక్కులో వుంది. సంక్రాంతి నెల నుంచీ, చిట్లాగాలులు పడమర దిక్కు పోతా ఉంటాయి. మా పక్క 'చిట్లాగాలి' అంటే దెయ్యం అని నమ్మకం. దెయ్యాలన్నీ కూడా శివరాత్రికి శివుడిని కలుసుకునేదానికి ఝరికి పోతాయంట. అదంతా గుర్తొచ్చి భయమేసింది. గబగబా శివుడికి ఆట్నించే దండం పెట్టుకునేసి దూరంగా వచ్చేసినా.

ఆడికి చుట్టుపక్కలా ఊర్లనుంచీ తెలిసినోళ్ళు, బంధువులు చానామంది వచ్చినారు. వాళ్ల పిల్లోళ్ళతో కలసి బండలెక్కి దిగేది, నీళ్ళలో దుంకేది, యిట్లా ఆటలతోనే గడిచి పోయింది. పొద్దు యింకా రెండు గంటలు వుండాదనంగానే మా వూరికి తిరిగి నడక మొదలు పెట్టినాం. ప్రతి సంవత్సరం ఝరికోనకు రావాలని, శివుడికి మొక్కోవాలని నిర్ణయించుకున్నా.

ఇప్పటికి పాతిక సంవత్సరాలు దాటింది. తర్వాత యింత వరకూ నేను ఝరికోనకు వెళ్లలేదు. అయితే ఇప్పటికీ ఆనాటి జ్ఞాపకాలు పదిలంగా వుండాయి.

శివరాత్రికి మాత్రమే, మాకు నచ్చిన ఆటలు ఆడుకునే అవకాశం ఉండేది కాబట్టి శివుడంటే ఇష్టం.

శివరాత్రికి మాత్రమే, ఉపవాసం ఉండే అవసరం లేదు కాబట్టి శివుడంటే ఇష్టం.

శివరాత్రికి మాత్రమే, ఝరికోనకు పోయే అవకాశం ఉంది కాబట్టి శివుడంటే ఇష్టం.

ఇతర దేవుళ్ళలాగా కాకుండా, మాంసం తింటాడు కాబట్టి శివుడంటే ఇష్టం.

*